

# తెల్లరాజు - నల్లదొర

పూసపాటి కృష్ణంరాజు

'గేలాపు విద్యా ఏ గనమైన విద్య' అంటాడు రోజూ చేపలు పట్టుతూ చెరువు గట్టున కూర్చునే నల్లదొర. పిల్లవాడికి నేర్పినందుకు తెల్లరాజుచేత చావు దెబ్బలూ తిన్నాడు. ఎవరు నలుపో, ఎవరు తెలుపో చెప్పడానికి మార్గం ఏముంది?

"హం! వీడూ 'చేగోడీ' అని పిలవడమే! హా" అన్నాడు చినమహారాజు పెదమహారాజుతో కలిసి ఆ సాయంత్రం మెయిన్ రోడ్డుమీద కనపడి.

"ఎవడు వాడు ?" అన్నాను, ఎదురుగ్గా వెళ్ళి.

"ఇంకెవడు ! ఇదిగో" అని పెద మహా

రాజును చూపించేడు.

"అనుకోనీ. అనుకొంటే వీడేంపోయె" అన్నాను.

"పోతుందని కాదుగాని" అని నసిగేడు.

"లేకపోతే నీకేంరా ? నువ్వు చేగోడీలా చుట్టుకు పోయిలేవుగా ? అందంగా,చలాకీగా నేవళంగా ఊరిన తేగలా కనిపిస్తున్నావే ?"

"ఓహో ! మళ్ళీ నీదోకొత్తిమీరా" అన్నాడు మాట పూర్తిచేయనివ్వకుండా.

"నిజంచెబుతున్నాను విను. తగిన ఒడ్డూ పొడుగూ ఉండి, కళకళలాడే చిరునవ్వు మొఖంతో వలుగుర్నీ పిలిచి కాస్త కాఫీనీళ్ళు పోయించే నిన్ను..."

"ఆగవోయ్ దద్దా ! అలా భట్రాజులా పేలక పోతే కాఫీకావాలని తిన్నగా ఏడవరాదూ" అంటూ హోటల్లోకి దారి తీసేడు.

"థేంక్సురా చిన్నా!" అన్నాను.

"అవేవో వీడికి చెప్పు. ప్రస్తుతం జేబులో ఉన్నది, వీడి బాపతు. వాళ్ల డాడీతో అరగంట

# తెల్లరాజు-నల్లదొర

పొట్లాడి పేష్కస్ వసూలు చేసుకొచ్చాం" అన్నాడు నవ్వుతూ.

"మళ్ళా ఏవిటే విషయం!" అన్నాను.

"చాలా ఉందిలే చెప్తారా" అని ఒక టేబులు ముందు కూర్చున్నాడు. పెద మహారాజా, నేనూ అతన్ననుసరించి కూర్చున్నాం.

కావలసిన వాటికి ఆర్డరివ్వడం జరిగిపోయింది.

"ఈవేళ చాలా తమాషా జరిగిందిలే" అన్నాడు.

"అవును తమాషా!" అన్నాను.

"సరిగా విను."

"వింటాను."

"మా ఇద్దరి వ్యవహారం నీకు తెలుసుకదూ?"

"అవును తెలుసు."

"ఏవిటి తెలుసు, సరిగా వినకుండా?"

"తెలుసు. చెప్పమంటావా?"

"చెప్పు."

"అయితే విను, నీకేం కావలసివా నువ్వు మీ బావాజీ నడగలేవు. అదేవిధంగా పెద మహారాజు వాడి తండ్రిగార్ని డైరెక్టుగా ఎదటపడి, ఫలానాది నాక్కావాలవలేదు. అంతేగదూ?" అన్నాను—వాణ్ణి జయించినట్టు చూస్తూ.

"ఏడిశావులే. నోరు మూసుకొని చెప్పేది సాంతం, జాగ్రత్తగా విను" అన్నాడు.

"చిత్తం" అన్నాను—నవ్వుకొంటూ.

"పెద మహారాజా వాళ్ల ఫాదర్నడిగి డబ్బు సంపాదించమన్నాడు. 'సరే' అని వెళ్లాను. ఆయన కనిపించి 'ఏంరా చిన్నా' అన్నారు.

"ఐదు" అన్నాను.

"ఐదూ లేదు. పదీలేదు. పాండి వెధవలు. అస్తమానం డబ్బు డబ్బు" అని విసుక్కొన్నారు.

"మీ పెద మహారాజుకు చాలా డబ్బొచ్చే యోగం ఉంది" అన్నాను.

"ఏడిశారు. ఎప్పుడో వెధవలు మీరు డాక్టరీ పూర్తి చెయ్యడం, ప్రాక్టీసు పెట్టి డబ్బు సంపాదించడమూను. ఉన్నది కాస్త కడిగేయకుండా ఉంటేసరి" అన్నారు.

"అంతవరకూ అక్కర్లేదు. త్వరలోనే వచ్చే యోగం ఉంది" అన్నాను.

"పోదూ, వెధవ్వి! ఎలా వస్తుంది" అన్నారు కాస్త మెత్తపడి.

"రేపు నెల్లో ఎన్. సి. సి. కేంపుకు వెళ్ల బోతున్నాం. అక్కడ మీవాడు ఒంటరిగా చల్ల గాలికి షికారెళ్తాడు. ఒక పెద్ద గుజరాతీ సేట్ లావుపాటి కారెక్కి షికారొచ్చి కారు దగ్గర కొడుకును ఆడుకొమ్మని, పెళ్లాంతో కలిసి సరుగుడు తోట్లో చెట్లచుట్టూ సినిమా జంటలా, డ్యూయట్లు పాడుకుంటూ ఉంటాడు. ఈలోగా కారు దగ్గరున్న 'పిల్లకాయ' గుజరాతీ దగ్గర్లో ఉన్న నూతి గట్టెక్కి తొంగి చూడబోయి జారి పడతాడు. డ్యూయట్లలో ఉన్న జంట, గతుక్కున అదిరిపోయి, నూతిచుట్టూ ఈతరాక లబోదిబోమని గోలెడుతూ గామగు తిరుగుతారు.

"అదే సమయంలో షికారు చాలించి తిరిగొస్తూన్న మన పెదరాజు, అమాంతం నూతిలోకి దూకి, ఆ కుర్రవాణ్ణి రక్షిస్తాడు. ఆమట్టున పెద్ద సేఠ్ మనవాడి సాహసానికి మెచ్చుకొని ఓ ఐదు లక్షలకు చెక్‌రాసిచ్చేస్తాడు. చక్కా జేబులో పెట్టుకొచ్చేస్తాం" అన్నాను నా జోక్‌కి నేనే నవ్వేసుకొంటూ.

"ఆయన నవ్వలేదు. పైగా ముఖం విచారంతో నిండిపోయింది. కుర్చీకి జేరగిలబడిపోయేరు. రెండు నిమిషాలేదో ఆలోచిస్తున్నట్టు కళ్లు మూసుకున్నారు. నాలో ఉత్సాహం అంతా ఎగిరి పోయింది.

"పెద రాజొచ్చి నా దగ్గర చేతులు కట్టుకు నిలుచున్నాడు. ఇంతలో ఆయన కళ్లు విప్పి చూసేరు.

"నిజంగా మీరలా అనుకొన్నా రేమిట్రా?" అనడిగేరు.



స్థాపితం 1920
రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు)
గోపాలపురం, తూ. గో. జిల్లా
కుష్ఠు బొల్లి మేహపాడ వగైరా చర్మ సుఖ వ్యాధులకు శాస్త్రీయ ప్రత్యేక చికిత్స.
ఆయుర్వేద ఔషధములు లభించును
→ కేటలాగు సలహా ఉచితము.
బ్రాంచీలు: వాల్తేరు ఆర్. ఎస్.
సికింద్రాబాద్ — 3560 కింగ్సువే




రాంతీర్థ బ్రాహ్మి నూనె
(స్పెషల్ నెం. 1) రిజిష్టర్డు



చుండు, వెంట్రుకలు రాలుట మాన్పి, వెంట్రుకలను పట్టువలె మృదువుగాను, కాంతిగాను నల్లగాను చేయు అమూల్యమైన హెయిర్ టానిక్. ఇది మెదడును చల్లబరచి, జ్ఞాపకశక్తిని పెంపొందించి కండ్ల వేడిమి, నిరంతర శిరోబాధ తగ్గించును. హాయిగా నిద్రపట్టించును.
రాంతీర్థ హెయిరాయిల్ పెద్ద సీసా: రు. 4/50, చిన్నసీసా: 2/25.
యోగాసన చార్టు
సచిత్రమైన మా యోగాసన చిత్రపటంలో చూపిన వివిధ యోగాసనముల నిరంతర అభ్యాసము వల్ల ఆరోగ్యకరమైన మంచి శరీరదార్డ్యత పొందండి.
పోస్టేజితో ధర రు. 3/—లు మాత్రమే.
శ్రీ రాంతీర్థ యోగాశ్రం
దాదర్. బొంబాయి — 14.



బోసి నవ్వు ఫోటో—ఎస్. వి. సత్యనారాయణ (సికిందరాబాదు)

"ఓన్! అదా" అని అనుకొని 'లేదండీ వట్టినే ఏదో వాగాను' అన్నాను—లాభం లేదనుకొని లేచిపోతూ.

"అలా కూర్చోండి చెబుతాను" అన్నారు.

తిరిగి బుద్ధిగా కూర్చున్నాం—ఆలకిస్తూ.

ఆయన చెప్పడం ప్రారంభించేరు.

"కానీకి మూడు దమ్మిడీలు, దమ్మిడీకి రెండు టోళీలు ఉండే రోజులవి. అదప్పటి సంగతి" అని ఆగిపోయారు.

"చెప్పండి" అన్నాను—విందామన్న కుతూహలంతో.

'మన ఊరు, ఊరుచుట్టూ ఊళ్ళు, తాలూకాలు, జిల్లా, జిల్లా యావత్తూ ఒక సంస్థానం. అప్పుడు ప్రజలంతా ప్రభువుచేత పరిపాలింపబడేవారు. అలాటి ప్రభువుల దివాణం దిబ్బకాక పూర్వం దివాణాల్లో ఖజానాలు, ఖజానాల పక్క నగారాలు ఉండేవి.

'నగారా మోత వినపడగానే తెల్లవారిందని అందరూ లేచి ఎవరి పని వారు చక్కబెట్టుకొనేవారు.

'ఈ నగారా వాయించడానికి ప్రత్యేకం ఇంగ్లీషు మాట్లాడే నల్లదొరల్ని, మహారాజావారు మైసూరు ప్రాంతంనుండి ప్రత్యేకం తెప్పించి కాంటన్‌మెంటులో వాళ్లకు బసఏర్పాటు చేసేరు.

'వాళ్లను క్రమేపీ కంట్రమెంటు దొర్లని పిలిచేవాళ్లం.

'మన ఊళ్లో పెద్ద చెరువు కాణా ఉంది చూడూ! అక్కడకు ప్రతి రోజూ ఒక నల్లదొర గేలా పురుగులు తెచ్చుకొని చెరువులో చేపలు పట్టుకొనేవాడు.

"తాతయ్య జ్ఞాపకం ఉన్నారా?" అని పెదరాజువైపు చూసేరు.

మనవాడు లేదన్నట్టు తలాడించేడు.

"అంటే, మీ తండ్రిగారు. ఆయన పేరేగా వీడికి పెట్టింది" అన్నాను.

"అవును. ఆయన, వీడిలా పొట్టిగా ఉండేవారా? అబ్బే,ఆజానుబాహువు. గిరజాల జుత్తూ, తిరిగిన మీసకట్టూ, ముడుకులు దిగకుండా కట్టిన సన్నటి మల్లు పంచ, గంజిపెట్టి యిస్త్రీ చేసిన అంగరకా వేసుకొని ఆయన సేరీవైపు వెళ్లినప్పుడు, వచ్చినప్పుడు పిట్టలు నీళ్ళు తాగేవి కావు.

'కాని చదువుకోలేదు. అలా అని అజ్ఞానులు కారు. ఆయనే కాదు. అప్పట్లో మన డిస్ట్రిక్టు మొత్తంమీద డిగ్రీ పుచ్చుకొన్న ప్రభువొక్కడూ వెతుకుదామన్నా కనిపించేవాడుకాదు' అన్నారు.

'ఆ నల్లదొర కథేదో చెబుదురూ, యీ సోదంతా ఎందుకు? ఇప్పుడు మీకు బి. ఏ.లు, ఎమ్మేలు, ఎమ్. ఎస్సీ.లు, డబుల్ డి.ఎస్సీ.లు, పిహెచ్. డీ.లు, ఎమ్. డీ. లనూ ఎంతమందిని చూపించమంటారు' అన్నాను.

'నువ్వు చూపిస్తావు—నాకూ ఓ డిగ్రీ ఉందన్న సంగతి నీకు తెలుసా!' అన్నారు.

'అవును నిజమే. జవాబు చెప్పలేకపోయాను.

'తిరిగి ఇలా ప్రారంభించేరు.

'తాతయ్య నన్ను ఇంగ్లీషు చదివిద్దామనుకోలేదు.

'మర్యాద, మప్పితం, దైవభక్తి, పాపభీతి ఉండి గౌరవంగా బతుకుతే చాలు. ఇంగ్లీషు చదువు లెందుకన్నారు.'

'అది సరే. అసలు కథకి రండి. ఆ దొరేమయాడు?' అన్నాను.

'వస్తున్నాను' అని చుట్ట ముట్టించి పొగ వదులుతూ చెప్పేరు.

'కంట్రమెంటు నల్లదొర చేపలు పడుతూ చెరువుగట్టున కూర్చొనేవాడని చెప్పేనుకదూ? అప్పటికి నా వయస్సు తొమ్మిదో ఏడు.

'జగన్నాథశర్మగారని కాశీలో సంస్కృతం చదువుకొన్న పండితు డొకాయన వచ్చి మన ఊళ్లో కాపరం పెట్టేడు.

'రోజూ ఆయన దగ్గర కూర్చొని సంస్కృత శ్లోకాలు వల్లించాలి. నాలిక సరిగ్గా స్వాధీనంలో ఉండక అప 'శబ్దాలు' పలుకుతే సొంటి పిక్క పట్టుకొని రక్తం పిండేసేవాడు.

'స్వతహాగా పౌరుషమైన పుట్టుక పుట్టడం చేత—నామోషీపడి నోరుమెదపకుండా కూర్చొనేవాణ్ణి. శ్లోకం వప్పజెప్పకపోతే వొప్పేది లేదని చిర్రు బుర్రు మనుకొంటూ వెళ్లేవాడు. ఆయనటు వెళ్లగానే నేనిటు పెద్ద చెరువుకు ఉడాయించి, నల్ల దొరను చేరుకొనే వాణ్ణి.'

'అబ్బ' అన్నాను.

'ఆ. నన్ను చూడగానే — 'కమాన్ మేన్ ప్లెంటీ ఫిష్. గిడుసు ఫిష్ — యిసుక దంతు ఫిష్. సవడ ఫిష్' అని దగ్గరకు పిలిచి గేలం ఎలా విసరాలో చేప లెలా పట్టాలో నేర్పేవాడు.

'గేలాపు విద్య ఏ గనమైన విద్య' అన్నాడు.

'ఎర్రను పిత్తన పరిగెలు పీకుతూంటే — బెండు నీట్లో కదిలేది. దాని వైపు తదేక ధ్యానంతో చూస్తూ, అవ్యక్తానందంతో గంటలు గడిచిపోయేవి. దొర కబుర్లు వింటూ, అతని భాషలో మాట్లాడడానికి ప్రయత్నం చేసేవాణ్ణి.

'ఇద్దరికీ ఇంతా అంతా జోస్తీ కాదు. ఒక్క రోజు కలుసుకోలేకుండా ఉండలేకపోయేవాళ్లం.

'అతని దగ్గర కేటిల్‌బార్ తీసుకొని రాళ్లేరి గువ్వపిట్టల్ని గురిచూసి కొట్టేవాణ్ణి.

'ఎప్పుడేనా ఒక రోజు చేపలు పడేవి కాదు. దొర ఇంటికి వెళ్లిపోతూ అప్పలమ్మ దుకాణంలో సామాన్లు కొనుక్కొనేవాడు. కానీ ఇచ్చి —

"దమ్మిడీ రొయ్యి ఫీస్. దమ్మిడీ చింత పండు, దమ్మిడీ దుంపలు — గివ్‌మి అప్పలమ్మా" అని అడిగేవాడు.

'నవ్వడం కాదు. ఆ భాషలో ఉన్న సౌలభ్యం ఆ తరువాతతెలిసింది. అప్పుడు అప్పలమ్మా నవ్వేదికాదు.

"వాటీజ్ దిస్, వంకాయ పులుస్ ? నీకేటి తెలుస్, నిమ్మకాయ పులుస్ ? ఏటి దొరగోరూ, కానీ ఇచ్చి బజారంతా తోడేయాలంటావు. జాగా లొట్టు" అనేది.

'నల్లదొర నెత్తిన పెట్టుకొన్న హేట్ తీసి తిరగేసి—

"పుట్‌టిట్ ఇన్‌దిస్ హేట్" అనేవాడు.

'అప్పలమ్మ రొయ్యి ఫీస్‌అ ందులో వేస్తే నవ్వుకొంటూ చేతిరుమాలు మీదనుకప్పి తలకు తగిలించుకొని వెళ్లిపోయేవాడు.

'ఇలా రోజూ దొరతో కలిసి వేట చేస్తూ ఉండగా ఒకనాడు విజయరామరాజు దద్దయ్య చెరువుగట్టుకొచ్చి ఉండేలు బద్దతో ఎగురుతూన్న బాతుల్ని కొట్టడానికి ఉండ లెగరేశారు.

'ఆయన కథొకటుంది. భీమునిపట్నం సముద్ర స్నానానికి వెళ్లి, స్నానంచేసి ఒడ్డు కొచ్చారట. జనం తండోప తండాలుగా ఉన్నారు.

ఇంతలో సుడిగాలొచ్చి, జనాన్ని చూస్తూ నిలుచున్న దొరసాన్ని చుట్టలాడున్న గౌనుతో ఆకాశం అంతమీదకు తేల్చి గిరవాటేసిందట. ఆ దొరసాని కిందపడకుండా తాటిచెట్టు కమ్మమీద వాలి ఉయ్యాలలా ఊగుతూందట. తాటిచెట్టు కింద దొర లబోదిబోమని గోలపెట్టడం చూసి,




# తెల్లరాజు–నల్లదొర

'తగ్గవయ్యా దొరా ?' అని చెప్పి దద్దయ్య ఉండేలుబద్దతో ఉండ లెగరేసి, టెన్నిస్ బంతిలా కిందకూ మీదకూ ఆడిస్తూ దొరసాని కూర్చున్న మట్టతోసహా దొరగారి కాళ్లవద్ద దించేరట. 'సెబాస్ రాజా' అన్నారట జనం యావత్తూను. దొర కౌగలించుకొని షేకేం డిచ్చేరట. ఆయన గొప్పగా ఎన్నిసార్లు కనిపించినా అదే చెప్పేవారు. అంతా నమ్మతున్నదీ లేనిదీ ఆయన కనవసరం.'

'ఆయన మాటకేం ? మన దొర సంగతి కానివ్వండి' అన్నాను.

'అదే చెబుతున్నాను. దద్దయ్యను చూసి 'కోతల దద్దయ్యా — కోతల దద్దయ్యా' అని ఆయన చుట్టూ గెంతుకొంటూ అల్లరి చేయడం మొదలుపెట్టేను. దొర పిలిచినా వెళ్లలేదు. తప్పని చెప్పినా వినలేదు. ఆఖాళాన దద్దయ్యకు కోపం వచ్చి—

'చదువెగ్గొట్టి ఇందంట చేపలు పట్టుకు తిరుగుతున్నావా ? మీ బావాజీతో చెప్తానుం'డని వెళ్లిపోయారు.

'ఆ రాత్రి లోగిట్లో తాతయ్య చెరువు దగ్గ రెప్పుడైనా కనిపిస్తే పాతిపెట్టేస్తానన్నారు.

'మాటాడలేదు. దద్దయ్యను మనసులోనే తిట్టుకొన్నాను.

'రెండు రోజులు దొర దగ్గరకు వెళ్లలేదు. అతన్ని చూడకుండా ఉండలేకపోయి మూడో నాడు సంస్కృత పాఠం అయిన వెంటనే పరుగెత్తుకొని వెళ్లి దొరమీద పడ్డాను.

'దొర వయస్సు మీకు చెప్పలేదు కదూ? అన్నట్టు మరిచేపోయాను. దొర వయస్సు ఏభై అరవై మధ్య ఉంటుంది. అయినా చలాకీగానే ఉండేవాడు.

"వై మేన్ — డింటు కమ్ ?" అని కౌగలించుకొని ముద్దు పెట్టుకొన్నాడు. ఇద్దరం కలిసిపోయి చేపలు పట్టుకోవడంలో నిమగ్నులమై ప్రపంచాన్ని మరిచిపోయాం.

'తాతయ్యెలా వచ్చారో వచ్చి రెండు చెవ్వులూ పట్టుకొని మీదకెత్తి కుదేశారు. చేపలా గిల గిల కొట్టుకొంటూ కింద పడ్డాను. పడ్డంతోనే లేచి ఆయన చేతి కందకుండా పరుగెత్తి దూరంగా నిలుచున్నాను.

'దొరను ఆయన చేతికొచ్చినట్టూ నాలుగు బాది, గేలపు రువ్వలు లాక్కొని, చేపల బుట్ట పట్టుకొని పో అని వాణ్ణి కసిరి చెరువు గట్టెక్కారు.

'నాకు దుఃఖం ఆగలేదు. నా మూలంగా నిష్కారణంగా చెట్టంత దొరను చేతికొచ్చినట్టూ కొట్టారు. దొర పల్లెత్తు మాటనలేదు. తల దించుకొన్నాడు. కళ్లవెంబడి జల జల నీరు కారుతూంది.

'ఇంటికి పద. చర్మం ఒలిచేస్తాను ' అని నావైపొచ్చారు.

'పౌరుషం వచ్చింది. కన్నూ మిన్నూ కనిపించలేదు. విరక్తి పుట్టింది. గట్టు దిగువనున్న నూతి గట్టెక్కి అందులో కురికేశాను.

'తాతయ్యకు కూడా ఈత రాదు. నూతి గట్టెక్కి కేక వేశారు. కేకలు విన్న దొర పరుగు పరుగున వచ్చి, గజమెత్తు గట్టూ కుప్పించి దాటి నన్ను బయటికి తీసి రక్షించాడు. పొట్టలో నీరు కక్కించేడు.

'నాకు జ్ఞాపకం వచ్చింది. తాతయ్య దొరను ఏం కావాలో కోరుకొమ్మన్నారు. 'గేలపు రువ్వలు, చేపలు బుట్ట నా కిప్పించండి. అంతే చా'లని అవి తీసుకొని వెళ్ళిపోయాడు.

'ఆ తరవాత మళ్లీ మన గ్రామం చాయలకు రాలేదు.

'పట్నంలో బసపెట్టి చదువు మొదలు పెట్టింతరువాత చాలా రోజులవరకూ అతని కోసం కంటోన్‌మెంటంతా వెతికాను. ఏమయాడో మరి కనిపించలేదు.'

"చనిపోయాడేమో ?" అన్నాను.

"ఏమో తెలీదు" అన్నారు.

"చనిపోయినవా ళ్లేమవుతారో" అన్నాను ఆలోచిస్తూ.

"అది మనం చెప్పగలిగితే ఇంకేం" అన్నారు చుట్టపొగ పీలుస్తూ.

"చనిపోయిన వాళ్లు మళ్లీ పుడతారని అనుకుంటారు. నమ్మతారా ?" అన్నాను.

"కావచ్చు, కాకపోనూవచ్చు" అన్నారు.

"లేదు. మీ కథ విన్నతరువాత నాకు గట్టి నమ్మకమే కుదిరింది. కావలిస్తే మీవాణ్ణి చూడండి. ఒక్క రంగులో తప్ప ఆ దొర పోలిక లన్నీ మన రాజాలో ఉన్నాయ్" అన్నాను నవ్వకుండా.

"ఆయ నేమీ మాట్లాడలేదు.

"ఆ దొర కెలాగూ ఋణపడున్నారు కాబట్టి అందులో అడ్వాన్సుగా ఓ ఐదు రూపాయ లిలా పడేసి మీవాడి పేరను పద్దు రాసుకోండి. సినిమాకి పోతాం. టైము లేదు" అన్నాను వాచీ చూపిస్తూ.

"ఓరి వెధవా! ఆఖరి కిదా నువ్వు చెప్పిన నీతి" అని నవ్వుతూ పర్సు తీసి పది రూపాయ లిచ్చారు.

"వాళ్ల బాబయ్యనడిగి వాడికి పది రూపాయలు సంపాదించి పెట్టేనందుకు సంతోషించక బేండు దొరనన్నానని, చేగొడీ, చేగొడీ! అని నన్ను వేపుకు తినేస్తున్నాడు—"

అని కంప్లెయింటు చేసేడు సీరియస్‌గా నాతో.

"క్రితం జన్మలో నువ్వు చేగొడీవేమో" అన్నాను సీరియస్‌గానే.

"హా విశ్వాస ఘాతకా" అని దీర్ఘం తీసేడు. ముగ్గురం నవ్వుకొంటూ రోడ్డున పడ్డాం. ★